Islam Aur Adle Ijtemayi
(Telugu)

# సామాజిక న్యాయం ఇస్లాంలోనే సాధ్యం


మూలం:

**మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది**

అనువాదం:

**అబ్దుల్ వాహెద్**



HYDERABAD

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002.


**SAMAJIKA NYAYAM ISLAMLONE SAADHYAM**
Islam Aur Adle Ijtemayi **(Telugu)**


**TIP Series No. 96**

Written by : Maulana Syed Abul A'la Maududi

Translated by : Abdul Wahed



All Rights Reserved with Publishers



First Edition : April 2002

Copies : 2000

Price : Rs. 8-00

ISBN : 81 - 86826 - 92 - 0

Published by : Telugu Islamic Publications
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 4564583
Fax : +91 +040 + 4576237

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

*అనంతకరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో*

# సామాజిక న్యాయం ఇస్లాంలోనే సాధ్యం

**(హి.శ. 1381లో అంటే క్రీ.శ. 1962లో హజ్ యాత్ర సందర్భంగా పవిత్ర మక్కా నగరంలో "ఆలమె ఇస్లామీ" నిర్వహించిన మహాసభలో చదివిన వ్యాసం ఇది.)**

## మారువేషంలో అసత్యం

మనిషిని దైవం అత్యుత్తమ ప్రవృత్తితో పుట్టించాడు. అందువల్లనే మనిషి బరితెగించి దైవద్రోహానికి, కల్లోలానికి పాల్పడలేదు. మనిషిలోని ఈ సుగుణం దేవుని చమత్కారాలలో ఒకటి. ఈ కారణం వల్లనే షైతాన్ తన విద్రోహాన్ని, కల్లోలాన్ని, శ్రేయోసంక్షేమాల మోసపుచ్చే ముసుగు తొడిగి మనిషి ముందు పెడుతుంటాడు. స్వర్గంలో ఆదం అలైహిస్సలామ్‌ను మోసగించిన షైతాన్ ఇదే పద్ధతి అవలంబించాడు. షైతాన్ ఆయనతో "మీరు దేవుని పట్ల అవిధేయత చూపేలా చేయాలన్నది నా ఉద్దేశ్యం. ఆ విధంగా మీరు స్వర్గం నుంచి బహిష్కరింపబడాలన్నది నా పథకం" అని చెప్పి ఉంటే ఆదం (అ.స)ను షైతాన్ మోసగించగలిగేవాడు కాదు. అందుకే వాడు ఆదం (అ.స)తో "శాశ్వత జీవితాన్ని, అంతంలేని రాజ్యాధికారాన్ని ప్రసాదించే వృక్షాన్ని మీకు చూపించనా" (తాహా : 120) అంటూ మోసగించాడు.

నేటికి కూడా మనిషి స్వభావం ఇలాగే ఉంది. నేడు కూడా షైతాన్ మనిషితో చేయించే తప్పులు, తలబిరుసు పనులన్నింటి వెనుక ఏదో ఒక మోసపుచ్చే ముసుగు, మభ్యపెట్టే నినాదం తప్పనిసరిగా ఉంటోంది.



## మొదటి భ్రమ - పెట్టుబడిదారీ విధానం, లౌకిక ప్రజాస్వామ్యం

షైతాను చేసే మోసాల్లో ఒక అతిపెద్ద మోసం – ప్రస్తుత కాలంలో సామాజిక న్యాయం పేరిట మానవాళికి జరుగుతున్న మోసం. దీర్ఘకాలం వరకు షైతాన్ 'వ్యక్తిగత స్వేచ్ఛ', 'ఉదారవాదం', అన్న నినాదాలతో ప్రపంచాన్ని మోసగిస్తూ వచ్చాడు. ఈ నినాదాల పునాదులపైనే పద్దెనిమిదవ శతాబ్దిలో పెట్టుబడిదారీ, లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను స్థాపించేలా చేశాడు. ఈ వ్యవస్థ ఎంత ప్రబలంగా స్థిరపడిందంటే, మానవ ప్రగతికి దీన్ని మించిన వ్యవస్థ మరొకటి లేదని ఒకప్పుడు పరిగణన పొందింది. ప్రగతిశీలవాదిగా పేరుపడాలని పరితపించే ప్రతి ఒక్కడు ఈ 'వ్యక్తిగత స్వేచ్ఛ', 'ఉదారవాదం' నినాదాలను భుజాలకెత్తుకున్నాడు. మానవాళికి తగిన వ్యవస్థ అంటూ ఏదన్నా ఉంటే, అది పాశ్చాత్య దేశాల్లో స్థాపించబడిన ఈ పెట్టుబడిదారీ, లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థ ఒక్కటేనని అందరూ భావించేవారు. కాని, క్రమేణా ఈ వ్యవస్థ ఎలాంటిదో ప్రజలు గ్రహించే రోజులూ వచ్చాయి. ఈ షైతాను వ్యవస్థ ప్రపంచంలో ఏ విధంగా దౌర్జన్యాలను, అణచివేతలను వ్యాపింపజేసిందో అందరూ చూశారు. ఆ తర్వాత ఇక ఈ నినాదంతో మరింత కాలం మోసగించడం షైతానుకు అసాధ్యం అయ్యింది.

## రెండవ భ్రమ - సామాజిక న్యాయం, సామ్యవాదం

షైతాన్ ఎంతోకాలం ఊరకే కూర్చోలేదు. సామాజిక న్యాయం, సామ్యవాదం పేర మరో భ్రమ ముందుకు తెచ్చాడు. అబద్ధాల ముసుగు కప్పి మరో వ్యవస్థ స్థాపించేలా చేశాడు. ఈ కొత్త వ్యవస్థ నేటి వరకు ప్రపంచంలో అనేక దేశాల ప్రజలను తీవ్రమైన అణచివేత, దౌర్జన్యాలకు బలయ్యేలా చేసింది. ఇలాంటి మరో ఉదాహరణ ప్రపంచంలో కానరాదు. కాని, షైతాను మోసం ఎంత పకడ్బందీగా ఉందంటే చాలా దేశాలు ఈ వ్యవస్థయే ప్రగతికి ఏకైక మార్గంగా భావిస్తూ దీన్ని స్వీకరించడానికి ముందుకు వస్తున్నాయి. ఈ భ్రమ ఇంకా తొలగిపోలేదు.

## విద్యావంతులయిన ముస్లిముల భావ దాస్యం

ఇక ముస్లిముల విషయానికి వస్తే, వారి వద్ద దైవగ్రంథం ఉంది, దైవప్రవక్త (సఅసం) మహితోక్తులు ఉన్నాయి. దైవగ్రంథం, ప్రవక్త (స) ప్రవచనాల రూపంలో శాశ్వతమైన హితబోధ వారి వద్ద ఉంది. షైతాను కుయుక్తులు, మోసాల గురించి హెచ్చరించడానికి, జీవితంలోని సమస్త రంగాలలో సన్మార్గం చూపించడానికి, ప్రళయకాలం వరకు సరిపోయే సామగ్రి ఇది. కాని, దురదృష్టవశాత్తు ఈ అభాగ్యులు తమ ధర్మం గురించి గ్రహింపులేని వారు, సామ్రాజ్యవాద శక్తుల సాంస్కృతిక, సైద్ధాంతిక ప్రవాహంలో కొట్టుకుపోతున్నారు. అందువల్లనే, ప్రపంచంలో ప్రాబల్యం వహిస్తున్న జాతుల శిబిరాల నుంచి వినవచ్చే ప్రతి నినాదం, ఇక్కడ తక్షణం ప్రతిధ్వనిస్తోంది. ఫ్రాన్సు విప్లవంలో జన్మించిన ఆలోచనలు, భావాలు బలంగా ఉన్న కాలంలో ముస్లిం దేశాలలో విద్యావంతుడైన ప్రతి ఒక్కడు సందర్భాసందర్భాలతో నిమిత్తం లేకుండా అవే భావాలు ఆలోచనలను వెలిబుచ్చుతూ తిరగడం, ఆ భావాల మూసలోనే తన్ను తాను ఇరికించుకోవడం తన విద్యుక్త బాధ్యతగా భావించేవాడు. అలా చేయకపోతే తనకు గౌరవ మర్యాదలు ఉండవని అనుకొనేవాడు. తనను అందరూ ఛాందసవాదిగా భావిస్తారని భయపడేవాడు. కొంతకాలం తర్వాత ఈ ఆధునిక విద్యాధిక ముస్లిముల ప్రార్థనల దిశ (ఖిబ్లా) కూడా మారిపోయింది. కొత్త కాలంతోపాటు సామాజిక న్యాయం, సామ్యవాదం అంటూ నినాదాలు చేసే వారు మన మధ్య కూడా పుట్టుకువచ్చారు. ఈ పరిస్థితే భరించశక్యం కానిది. కాగా, పరిస్థితి మరింత దిగజారి, మనలోనే మరో వర్గం, తన ప్రార్థనల దిశ (ఖిబ్లా)ను మార్చుకోవడంతోపాటు ఏకంగా ఇస్లామ్ దిశనే మార్చాలని కోరే వర్గం బయలుదేరింది. ఇస్లామ్‌కు దూరమై బ్రతకలేనివాళ్ళ మాదిరిగా, వాళ్ళతో పాటు ఇస్లామ్ కూడా ఉందన్నట్లు మాట్లాడసాగారు. ఇస్లామ్ వాళ్ళతో ఉండాలని అంటారు, కాని, తాము ఎవరి దాస్యం చేస్తున్నారో వారికి ఇస్లామ్ కూడా దాస్యం కావాలన్నది వీరి కోరిక. ఆ విధంగా ధర్మభ్రష్టులయ్యారన్న నింద రాకుండా ఉండాలన్నది వీరి ఎత్తుగడ. అందువల్లనే, వ్యక్తిగత స్వేచ్ఛ, ఉదారవాదం, పెట్టుబడిదారీ సెక్యులర్ ప్రజాస్వామ్యం గురించిన పాశ్చాత్య



భావనలు అన్నీ ఇస్లాంకు అనుగుణంగానే ఉన్నాయంటూ నిరూపించడానికి మొదట్లో ప్రయత్నాలు జరిగాయి. ఈ కారణం వల్లనే ఇప్పుడు కూడా సామ్యవాదంలోని సామాజిక న్యాయం ఇస్లామ్‌లోనూ ఉందని చెబుతుంటారు. ఇది భావ దాస్యానికి పరాకాష్ఠ. కొందరు విద్యాధిక ముస్లిముల అజ్ఞానం, ఆలోచనల దాస్యానికి ఇది శిఖరాగ్రం.

## సామాజిక న్యాయంలోని వాస్తవాలు

ఈ సంక్షిప్త వ్యాసం ద్వారా నేను చెప్పదలిచినది – సామాజిక న్యాయం అంటే ఏది? సామాజిక న్యాయాన్ని స్థాపించే సరియైన పద్ధతి ఏది? అన్న విషయాలు. ఇది చదివి సామాజిక న్యాయం స్థాపించబడాలంటే సామ్యవాదం ఒక్కటే మార్గం అని నమ్మి, సామ్యవాద సమాజాల నిర్మాణానికి పూనుకొన్నవాళ్ళు తమ తప్పు తెలుసుకొని, పశ్చాత్తాపపడే అవకాశాలు చాలా తక్కువ అని నాకు తెలుసు. ఎందుకంటే ఒక అజ్ఞాని, అజ్ఞానిగా మాత్రమే ఉన్నప్పుడు సంస్కరణకు అనేక అవకాశాలు ఉంటాయి. కాని వాడి చేతికి అధికారం వస్తే వాడు పాలకుడయిపోతే "తాను తప్ప మరో దైవం లేదనే" స్థాయికి దిజారిపోయే పరిస్థితి ఉంటుంది. ఇలాంటి వారికి నచ్చజెప్పేవాడు ఎంత చెప్పినా అర్థం చేసుకొనే అర్హత ఉండదు. కానీ దైవకృప వల్ల సాధారణ ప్రజలు ఎల్లప్పుడు అర్థం చేసుకొనే అర్హత కలిగి ఉంటారు. సరియైన విధంగా నచ్చజెప్పి వారిని షైతాన్ పన్నాగాల గురించి హెచ్చరించడం సాధ్యమే. మార్గభ్రష్టులయిన వాళ్ళు ఈ సాధారణ ప్రజలనే మోసపుచ్చి, తమ దుర్మార్గాన్ని కొనసాగిస్తూ ఉంటారు. అందువల్ల సాధారణ ప్రజల ముందు వాస్తవాలను విడమర్చి చెప్పడమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశ్యం.

## ఇస్లాంలోనే సామాజిక న్యాయం ఉంది

వాస్తవమేమంటే ఇస్లాంలో మాత్రమే సామాజిక న్యాయం ఉంది. విశ్వ సృష్టికర్త, విశ్వప్రభువు అల్లాహ్ మానవుల మార్గనిర్దేశనానికి పంపిన సత్యధర్మం ఇస్లాం. మానవుల మధ్య న్యాయాన్ని స్థాపించడం, మానవులకు ఏది న్యాయం, యేది అన్యాయం అన్నది నిర్ణయించడం మానవుల సృష్టికర్త, ప్రభువు అయిన

అల్లాహ్ పని. ఏది న్యాయం, యేది దౌర్జన్యం అన్న ప్రమాణాలను నిర్ణయించే అర్హత మరెవ్వరికీ లేదు. వాస్తవమైన న్యాయాన్ని స్థాపించే స్తోమత ఇంకెవ్వరికీ లేదు. మనిషి తనకు తానే యజమాని కాదు, పాలకుడు కాదు. తన కోసం న్యాయ ప్రమాణాలను నిర్ధారించుకోగల యోగ్యత అతనికి లేదు. విశ్వంలో మనిషి స్థాయి, దేవుని దాసుని స్థాయి మాత్రమే. పాలితుని స్థాయి మాత్రమే. అందువల్ల న్యాయప్రమాణాలను నిర్ధారించడం మనిషి పని కాదు, మనిషిని సృష్టించిన విశ్వప్రభువు, మానవుల స్వామి అల్లాహ్ పని. ఒక మనిషి ఎంత ఔన్నత్యం గలవాడు అయినప్పటికీ, ఒక్కడే కాదు, అనేకమంది అత్యున్నత స్థాయిగల మనుషులు కలసి తమ మేధాశక్తిని సంయుక్తంగా ఉపయోగించినప్పటికి కూడా, మనిషి జ్ఞానానికి ఉండే పరిమితులు, మనిషి బుద్ధిలో ఉండే అలసత్వం, అసమర్థత, మనిషి మనస్సులో ఉండే కోరికలు, పక్షపాతాల ప్రభావం – వీటన్నిటికీ అతీతంగా ఉండడం అన్నది అసంభవం. అందువల్ల మనిషి స్వయంగా తన కోసం న్యాయబద్ధమైన వ్యవస్థను నిర్మించుకోవడమన్నది అసాధ్యం. మనిషి రూపొందించుకొన్న వ్యవస్థల్లో ప్రారంభంలో ఎంతో కొంత న్యాయం పైకి కనబడినప్పటికీ, త్వరలోనే ఆచరణలో న్యాయం లేదన్న వాస్తవం అనుభవానికి వస్తుంది. ఈ కారణం వల్లనే మానవ నిర్మిత వ్యవస్థలు కొంత కాలం పనిచేసిన తర్వాత పనికిరానివిగా మిగిలిపోతాయి. మనిషి ఆ వ్యవస్థ పట్ల విసుగు చెంది, మరో అవివేకపు ప్రయోగానికి పూనుకొంటాడు. వాస్తవ న్యాయం అన్నది కేవలం విశ్వప్రభువు, గోచరాగోచరాల జ్ఞానం కలవాడు, పరిశుద్ధుడు, పవిత్రుడు అయిన అల్లాహ్ నిర్మించిన వ్యవస్థలో మాత్రమే లభిస్తుంది.

## ఇస్లాం ముఖ్యోద్దేశ్యం న్యాయం

అర్థం చేసుకోవలసిన రెండవ విషయమేమిటంటే – "ఇస్లాంలో న్యాయం ఉంది" అని చెప్పే వ్యక్తి వాస్తవాలను తగ్గించి మాట్లాడుతున్నాడు. వాస్తవమేమంటే, న్యాయమే ఇస్లాం ముఖ్యోద్దేశ్యం. న్యాయాన్ని స్థాపించడానికే ఇస్లాం అవతరించింది. ఈ విషయమై అల్లాహ్, "మేము మా ప్రవక్తలను తేజోవంతమైన సూచనలతో సహా పంపాము. వారితోపాటు దివ్యగ్రంథాన్ని, త్రాసును



అవతరింపజేశాము. తద్వారా మనిషి న్యాయంపై స్థిరంగా ఉండాలని. మేము లోహాన్ని అవతరింపజేశాము. అందులో గొప్ప శక్తి, ప్రజల కొరకు ప్రయోజనాలూ ఉన్నాయి. చూడకపోయినప్పటికీ అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తలకు సహాయం చేసేది ఎవరో చూడాలని ఇదంతా చేశాము. నిస్సందేహంగా అల్లాహ్ అత్యంత శక్తిమంతుడు, అత్యున్నతుడు." (అల్ హదీద్ : 25)

ఈ రెండు విషయాలను ముస్లిమ్ మరచిపోనట్లయితే, సామాజిక న్యాయం కోసం అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (స)ను వదలి ఇతరత్రా వెదికే పొరబాటు ఎన్నటికీ చేయడు. న్యాయం అవసరమనిపించిన తక్షణం అతడు న్యాయం అన్నది అల్లాహ్, ఆయన ప్రవక్త (స)ల వద్ద తప్ప మరెక్కడా లేదని, ఉండబోదని గ్రహిస్తాడు. అంతేకాదు, న్యాయాన్ని స్థాపించాలంటే ఇస్లామ్‌ను, సంపూర్ణంగా, ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా స్థాపించడం తప్ప మరో మార్గం లేదని కూడా తెలుసుకుంటాడు. న్యాయం అన్నది ఇస్లామ్‌కు భిన్నమైన మరో వస్తువు పేరు కాదు. స్వయంగా ఇస్లామ్ న్యాయం. ఇస్లాం స్థాపన అంటే న్యాయం స్థాపించబడడమే.

## సామాజిక న్యాయం

ఇక ఇప్పుడు, అసలు సామాజిక న్యాయం అంటే ఏమిటో చూద్దాం. సామాజిక న్యాయాన్ని స్థాపించే సరిఅయిన పద్ధతి ఏదో తెలుసుకుందాం.

## మానవ వ్యక్తిత్వ వికాసం

మానవ సమాజం అన్నది వేలాది, లక్షలాది లేదా కోట్లాది వ్యక్తుల సమూహం. ఈ సమూహంలోని ప్రతి వ్యక్తి ఆత్మ, బుద్ధివివేకాలు, చైతన్యం కలవాడే. ప్రతి వ్యక్తి తనదైన ప్రత్యేక వ్యక్తిత్వం కలిగి ఉంటాడు. ఈ వ్యక్తిత్వం వృద్ధివికాసాలు చెందడానికి అవకాశాలు లభించాలి. ప్రతి వ్యక్తికీ తనదైన ప్రత్యేక ఆసక్తులు ఉంటాయి. ప్రతి వ్యక్తికీ మానసికంగా అభిలాషలు, ఆకాంక్షలు ఉంటాయి. మనస్సు, శరీరాలకు సంబంధించిన అవసరాలూ ఉంటాయి. ఈ వ్యక్తులు ఏదో ఒక యంత్రంలోని భాగాలవంటి వారు కాదు. ప్రాధాన్యత యంత్రానికి తప్ప విడిభాగాలకు ఉందని, కేవలం యంత్రం కోసమే ఉనికిలో

ఉన్నటువంటి, ఎలాంటి సొంత ఉనికిలేని భాగాలవంటి వారు కాదు. ఒక యంత్రానికి భిన్నంగా మానవ సమాజం ఆత్మ, వ్యక్తిత్వం ఉన్న మనుషుల సమూహం. సమూహం కోసం వ్యక్తులు లేరు. సమూహమే వ్యక్తుల కోసం ఏర్పడింది. ఒకరికొకరు సహాయపడుతూ తమ తమ అవసరాలు తీర్చుకోడానికి, తమ మానసిక, శారీరక ఆవశ్యకతల పరిపూర్తికి కావలసిన అవకాశాలు కల్పించుకోడానికి వ్యక్తులు కలసి సమూహాన్ని ఏర్పరుస్తారు.

## వ్యక్తిగత బాధ్యత

ఈ వ్యక్తులందరూ, ప్రతి ఒక్కరూ దేవుని ముందు జవాబు చెప్పుకోవలసి ఉంది. ప్రతి ఒక్కరికీ ఈ ప్రపంచంలో ఒక నిర్ణీత పరీక్షా వ్యవధి (ఇది ఒక్కొక్కరికి ఒక్కోలా ఉంటుంది) ఉంది. ఈ వ్యవధి గడిచిన తర్వాత దైవం ముందు హాజరై లెక్కచెప్పుకోవలసి ఉంటుంది. మనిషికి ప్రపంచంలో ఇవ్వబడిన శక్తి సామర్థ్యాలు ఉపయోగించి, అతనికి ఇవ్వబడిన సాధనాలు వినియోగించి అతడు ఎలాంటి వ్యక్తిత్వం సముపార్జించుకొని వచ్చాడో చెప్పుకోవలసి ఉంది.

దేవుని ముందు లెక్కచెప్పుకోవలసిన ఈ జవాబుదారీతనం సామూహికమైనది కాదు, వ్యక్తిగతమైనది. అక్కడ వంశాలు, తెగలు, జాతులు లేచి నిలబడి జవాబు చెప్పుకోవడం ఉండదు. ప్రపంచంలోని సమస్త బాంధవ్యాల నుంచి మనిషిని వేరుచేసి దేవుడు ప్రతి ఒక్కడిని వేరువేరుగా తన న్యాయ స్థానంలోకి రప్పిస్తాడు. ప్రతి ఒక్కడిని "నువ్వేమి చేసి వచ్చావు? ఎలా తయారై వచ్చావు?" అని ప్రశ్నిస్తాడు.

## వ్యక్తిగత స్వేచ్ఛ

ఈ రెండు విషయాలు – అంటే, ప్రపంచంలో మనిషి వ్యక్తిత్వ వికాసం, పరలోకంలో మనిషికి ఉండే జవాబుదారీ బాధ్యత – తెలిపే వాస్తవమేమిటంటే, ప్రపంచంలో మనిషికి స్వేచ్ఛ ఉంది. ఏదైనా సమాజంలో వ్యక్తికి అతడికి ఇష్టమైన రీతిలో వ్యక్తిత్వాన్ని నిర్మించుకొనే అవకాశాలు లభించనట్లయితే, అతడిలోని మానవత్వం అలజడికి గురవుతుంది. అతడికి ఊపిరి సలపదు. అతడి శక్తిసామర్థ్యాలు అణగారిపోతాయి. మనిషి నిర్బంధంలో, నిస్సహాయ



స్థితిలో కూరుకుపోతాడు. మనిషి నిర్వీర్యుడైపోతాడు. పరలోకంలో ఈ నిస్సహాయ, నిర్వీర్య మనుషుల బాధ్యత ఇలాంటి సామాజిక వ్యవస్థను నిర్మించి, అమలులోపెట్టిన వారి నెత్తిన వేయడం జరుగుతుంది. ఇలాంటి సామాజిక వ్యవస్థల నిర్మాణానికి బాధ్యులైన వారిని పరలోకంలో కేవలం వారి వ్యక్తిగత ఆచరణల గురించి మాత్రమే లెక్క అడగడం ఉండదు. ఒక దౌర్జన్యభరితమైన వ్యవస్థను నిర్మించి, అనేక మంది మనుషులను, వారి ఇష్టాయిష్టాలకు విరుద్ధంగా, తమ ఇష్టాయిష్టాల ప్రకారం నిర్వీర్య వ్యక్తిత్వాలుగా తయారుచేసిన విషయమై జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. పరలోకాన్ని విశ్వసించే వాడు ఇలాంటి పర్వత సమానమైన పాప భారాన్ని మోస్తూ దేవుని ముందు హాజరు అయ్యే ఊహకు సయితం వణికిపోతాడు. దైవ భయంకల మనిషి ఇతరులకు సాధ్యమైనంత ఎక్కువ స్వేచ్ఛ ఇవ్వడానికే సిద్ధపడతాడు. అప్పుడే ప్రతి వ్యక్తి, అతను ఎలాంటి వ్యక్తిగా తయారైనా అతడి సొంత బాధ్యతపై ఉంటాడు. సామాజిక వ్యవస్థను నడిపే వానిపై ఇతరుల వ్యక్తిత్వాలు తప్పుడు వ్యక్తిత్వాలుగా మార్చిన బాధ్యత పడకుండా వ్యవహరిస్తాడు.

## సాంఘిక సంస్థలు - వాటి అధికారాలు

వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విషయాలివి– కాని మన సమాజాన్ని చూస్తే, కుటుంబాలు, వంశాలు, తెగలు, జాతులు, చివరకు పూర్తి మానవాళిగా ఒక క్రమబద్ధమైన పద్ధతిలో కనబడుతుంది. ఒక స్త్రీ, ఒక పురుషుడు వారి పిల్లలతో సమాజం ప్రారంభమవుతుంది. ఇది కుటుంబం. ఈ కుటుంబాలతోనే వంశాలు, తెగలు ఏర్పడుతాయి. వీటితో ఒక జాతి ఏర్పడుతుంది. ప్రతి జాతి సామూహిక ప్రయోజనాలు, ఉద్దేశాలతో ఒక రాజ్యాన్ని స్థాపించుకొంటుంది. ఇలా వివిధ రూపాలుగా ఉన్న ఈ సాంఘిక సంస్థలు ఏర్పడడానికి ముఖ్యకారణం, ముఖ్యోద్దేశ్యం ఏమిటంటే, ఈ విధంగా పరిరక్షణ పొందడం. ఈ సంస్థల ద్వారా ప్రతి వ్యక్తికి అతను సంపూర్ణ వ్యక్తిత్వాన్ని – వ్యక్తి స్వయంగా తన సొంత శక్తిసామర్థ్యాలతో సాధించుకోలేని వ్యక్తిత్వాన్ని పొందే అవకాశాలు కల్పించుకోవడం. కాని ఈ మౌలిక ఉద్దేశాలు నెరవేరాలంటే సాంఘిక సంస్థలకు వ్యక్తులపై, పెద్ద సంస్థలకు చిన్న సంస్థలపై అధికారం ఉండడం అవసరం.

ఇలాంటి అధికారం ఉంటేనే వ్యక్తులు వ్యక్తిగత స్వేచ్ఛ ఇతరుల విషయంలో జోక్యం చేసుకొనే స్థాయికి చేరకుండా నియంత్రించడం సాధ్యపడుతుంది. అలాగే సమాజంలోని అందరు వ్యక్తుల సామూహిక శ్రేయోవికాసాలకు అవసరమైన సేవలను వ్యక్తుల నుంచి పొందడానికి కూడా ఈ అధికారాలు అవసరం. ఈ సందర్భంగానే సామాజిక న్యాయం అన్న సమస్య తలెత్తుతుంది. వ్యక్తిగత అవసరాలు, సామూహిక అవసరాల మధ్య వైరుధ్యం ఒక చిక్కుముడి పడేది ఇక్కడే. ఒకవైపు మానవ సంక్షేమం దృష్ట్యా ప్రతి వ్యక్తికి సమాజంలో స్వేచ్ఛ ఉండాలి. అప్పుడే అతడు తన శక్తిసామర్థ్యాలు, తన యిష్టాయిష్టాల ప్రకారం తన వ్యక్తిత్వాన్ని పొందగలుగుతాడు. ఇదే విధంగా కుటుంబాలు, వంశాలు, తెగలు, ఇలా వివిధ సంస్థలలో పెద్ద సంస్థల పరిధిలో ఉన్న చిన్న వాటికి వాటి పరిధిలో లభించవలసిన స్వేచ్ఛ వాటికి లభించాలి. కాని, మరోవైపు, అదే మానవ సంక్షేమం దృష్ట్యా వ్యక్తులపై కుటుంబానికి, కుటుంబంపై వంశాలు లేదా తెగలకు, వ్యక్తులందరిపై చిన్న సంస్థలన్నింటిపై రాజ్యానికి అధికారం ఉండాలి. అప్పుడే ఎవ్వరూ తమ హద్దులు దాటి ఇతరులపై దౌర్జన్యం చేయకుండా అదుపు చేయడం సాధ్యపడుతుంది. మరికాస్త ముందుకు వెళితే, ఇదే సమస్య సమస్త మానవాళికి కూడా వర్తిస్తుంది. ఒకవైపు జాతి లేదా రాజ్యాలకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, స్వయం నిర్ణయాధికారాలు ఉండడమూ అవసరమే, మరోవైపు ఈ జాతులు లేదా రాజ్యాలు తమ పరిమితులు అతిక్రమించకుండా అదుపు చేసే మహాశక్తి అవసరమే.

ఈ విధంగా, సామాజిక న్యాయం అంటే వ్యక్తులు, కుటుంబాలు, వంశాలు, తెగలు, జాతులలో అందరికీ సముచిత స్వేచ్ఛ లభించడంతోపాటు దౌర్జన్యాలు, అణచివేతలను అడ్డుకోడానికి వివిధ సాంఘిక సంస్థలకు వ్యక్తులపై, పెద్ద సంస్థలకు చిన్న సంస్థలపై అధికారాలూ ఉండాలి. అదే విధంగా వివిధ వ్యక్తులు, సంస్థల నుంచి సామూహిక సంక్షేమానికి అవసరమైన సేవలు పొందడానికి అవసరమైన అధికారాలూ ఆయా సాంఘిక సంస్థలకు ఉండాలి.

## పెట్టుబడిదారీ, సామ్యవాద వ్యవస్థల లోపాలు

ఈ వాస్తవాలను బాగా అర్థం చేసుకొన్న వ్యక్తి ఫ్రాన్సు విప్లవ నేపథ్యంలో జన్మించిన వ్యక్తి స్వేచ్ఛ, ఉదారవాదం, పెట్టుబడిదారీ, లౌకిక ప్రజాస్వామ్య



భావనల వ్యవస్థ సామాజిక న్యాయానికి పూర్తిగా వ్యతిరేకమని మొదటి చూపులోనే గ్రహిస్తాడు. అంతేకాదు. కారల్ మార్క్స్, ఎంగెల్స్‌లను అనుసరిస్తూ స్థాపించబడే సామ్యవాద వ్యవస్థ కూడా అంతకన్నా ఎక్కువగా సామాజిక న్యాయానికి వ్యతిరేకం అని తెలుసుకొంటాడు. మొదటి వ్యవస్థలోని లోపం ఏమిటంటే, ఇందులో పరిమితులకు మించి వ్యక్తి స్వేచ్ఛ ఇచ్చి, వంశాలు, తెగలు, జాతులపై దౌర్జన్యం చేసే వీలు కల్పించింది. వ్యక్తి ద్వారా సామూహిక సంక్షేమానికి సంబంధించిన సేవలు పొందడానికి అవసరమైన సామాజిక నియమావళిలో చాలా సడలింపులు ఇచ్చింది. ఇక రెండవ వ్యవస్థ విషయానికి వస్తే, ఈ వ్యవస్థ రాజ్యానికి పరిమితులకు మించి అధికారాలు కట్టబెట్టి వ్యక్తులు, వంశాలు, తెగల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను దాదాపు పూర్తిగా హరించివేసింది. వ్యక్తుల ద్వారా సామాజిక సేవలు పొందడానికి రాజ్యానికి ఎంతగా అధికారాలు ఇచ్చిందంటే, వ్యక్తులు వ్యక్తిత్వం ఉన్న మనుషుల్లాకాక, ఒక యంత్రంలోని ప్రాణంలేని భాగాల్లా మారిపోతారు. ఈ వ్యవస్థ ద్వారా సామాజిక న్యాయం స్థాపించబడుతుందని చెప్పే మాటలు పచ్చి అబద్ధాలు.

## సామ్యవాదం, సామూహిక దౌర్జన్యానికి పరాకాష్ఠ

నిస్సందేహంగా ఇది సామూహిక దౌర్జన్యానికి పరాకాష్ఠ. ఏ కాలంలోనూ ఇలాంటి దిగజారిన స్థితి ఏర్పడలేదు. నమ్రూద్, ఫిర్ఔన్, చంగీజ్‌ఖాన్‌ల కాలాల్లోనూ లేని దౌర్జన్యాలకు ఆలవాలం ఇది. ఒక వ్యక్తి లేదా కొందరు వ్యక్తులు కలసి తమ సొంత విధానాన్ని సిద్ధంచేసి, ప్రభుత్వాల్ని బలవంతంగా చేజిక్కించుకొని, ప్రభుత్వం ద్వారా హద్దుల్లేని అధికారాలు పొంది, తమ సొంత విధానాన్ని దేశంలోని కోట్లాది ప్రజలందరిపై బలవంతాన రుద్దడం, ప్రజల ఆస్తులను స్వాధీనపరచుకోవడం, కార్ఖానాలను జాతీయ ఆస్తులుగా మార్చి వేయడం, పూర్తి దేశాన్ని ఒక జైలుగా మార్చి ప్రజలకు విమర్శించే, ఫిర్యాదు చేసే, న్యాయాన్ని కోరే అవకాశాలు లేకుండా చేయడం, దేశంలో ఎలాంటి సంఘాలు, పార్టీలు లేకుండా చేయడం, ఎలాంటి సంస్థలు లేకుండా చేయడం, ప్రజలు నోరువిప్పి మాట్లాడగలిగే ఎలాంటి వేదిక లేకుండా చేయడం, తమ అభిప్రాయాలు ప్రకటించడానికి పత్రికల వంటి సాధనాలేవీ లభించకుండా

చేయడం, న్యాయం కోసం ప్రజలు శరణు పొందడానికి ఎలాంటి న్యాయస్థానం లేకుండా చేయడం, ప్రతి మనిషి, ఎదుటి మనిషిని అనుమానిస్తూ భయపడే స్థాయికి గూఢచార వ్యవస్థను విస్తరింపజేయడం, చివరకు తన సొంత ఇంట్లో అయినా నోరువిప్పే ముందు మనిషి జాగ్రత్తగా ఎవరయినా వింటున్నారా, ఎవరైనా తన మాటలు ప్రభుత్వానికి చేరవేసే వాళ్ళున్నారా అని భయపడుతూ నలుదిశలా పరికించి చూసే పరిస్థితి కల్పించడం, ప్రజాస్వామ్యం అని మభ్యపుచ్చడానికి ఎన్నికలు నామమాత్రంగా జరిపించడం, తమ సిద్ధాంత విధానాలను వ్యతిరేకించే వాళ్ళెవ్వరూ ఎన్నికలలో పాల్గొనకుండా పూర్తి స్థాయి ప్రయత్నాలు చేయడం, సొంత అభిప్రాయాలు గలవాడెవ్వడు అధికార సదనాలలో ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవడం – ఇలాంటి వ్యవస్థను బుద్ధివివేకాలున్న మనిషి సామాజిక న్యాయం ఉన్న వ్యవస్థగా భావించగలడా?

ఇలాంటి వ్యవస్థలో ఒకవేళ ఆర్థికంగా సంపద అందరికి సమానంగా పంపిణి జరుగుతుందని మాట వరసకు అనుకున్నప్పటికీ – వాస్తవమేమంటే నేటి వరకు సామ్యవాద వ్యవస్థ యేదీ ఈ ఆదర్శాన్ని సాధించలేకపోయింది – న్యాయం అంటే ఆర్థిక సమానత్వానికి మారుపేరు కాదు. ఈ వ్యవస్థలో పాలకులు, పాలితుల మధ్య ఆర్థిక సమానత్వం ఉందా అని నేను ప్రశ్నించదలచుకోలేదు. ఈ వ్యవస్థలో అధికారం చలాయించే నియంత, ఈ వ్యవస్థలో జీవించే ఒక సాధారణ రైతుల జీవన ప్రమాణాలు సమానంగా ఉన్నాయా లేదా అన్నది కూడా నేను ప్రశ్నించదలచుకోలేదు. నేను ప్రశ్నించదలిచింది ఒక్కటే – వీళ్ళందరి మధ్య నిజంగా ఆర్థిక సమానత్వం ఏర్పడినప్పటికీ – మాట వరసకు – అది సామాజిక న్యాయం అవుతుందా? నియంత, అతడి అనుచరులు కలసి తయారుచేసిన విధానాలను పోలీసు, సైన్యం, గూఢచార యంత్రాంగాలను ఉపయోగించి బలవంతాన పూర్తి జాతిపై రుద్దగలరు కాని, జాతిలోని యే వ్యక్తి కూడా ఈ విధానాలను లేదా ఈ విధానాలపరంగా అమలవుతున్న యే ఒక్క అతి స్వల్పమైన కార్యాచరణను కూడా కనీసం నోటి మాటగా వ్యతిరేకించే స్వేచ్ఛ కూడా ఇవ్వకపోవడం న్యాయమా! నియంతకు, అతడి వెంట ఉండే గుప్పెడు మందికి తమ విధానాలను అమలుపరచడానికి దేశంలోని సమస్త సాధనాలు, వనరులు ఉపయోగించుకొనే అధికారం ఉండొచ్చు, ఎలాంటి సంస్థలనయినా స్థాపించే స్వేచ్ఛ ఉండొచ్చు కాని, వారితో భేదాభిప్రాయంగల



ఇద్దరు వ్యక్తులు కూడా ఒక సంఘంగా ఏర్పడే వీలు లేకపోవడం, బహిరంగంగా యే సభలోనూ మాట్లాడే అవకాశం లేకపోవడం, పత్రికల్లో ఒక్క మాటయినా ప్రచురించే అవకాశం లేకపోవడం – ఇది న్యాయమా! జమిందారులను, భూస్వాములను తొలగించి పూర్తి దేశంలో ఒకే ఒక్క జమిందారు, భూస్వామిగా ప్రభుత్వం ఏర్పడడం, ఆ ప్రభుత్వ అధికారం కూడా గుప్పెడు మంది చేతుల్లో ఉండడం, ఈ గుప్పెడు మంది పూర్తి జాతిని నిస్సహాయ స్థితిలో పడవేసే పద్ధతులు పాటించడం, ప్రభుత్వాధికారం వారి చేతుల నుంచి ఇతరుల చేతుల్లోకి మారడమన్నది అసాధ్యంగా ఉండడం – ఇది న్యాయమా! మనిషి అంటే ఆకలి బాధకు మారుపేరు కానట్లయితే, మానవ జీవితం కేవలం ఆర్థిక వ్యవహారాలకే పరిమితం కానట్లయితే, కేవలం ఆర్థిక సమానత్వమే 'న్యాయం' అని ఎలా చెప్పగలం. జీవితంలోని అన్ని రంగాలలో బలప్రయోగం, దౌర్జన్యాలతో మానవత్వాన్ని అన్ని విధాల అణచివేసి, ఆర్థికంగా, ఒకవేళ ప్రజలందరినీ సమానులు చేసినప్పటికీ, స్వయంగా నియంత, అతడి సహచరుల జీవన ప్రమాణాలు కూడా సాధారణ ప్రజల జీవన ప్రమాణాల స్థాయికి సమానంగా ఉన్నప్పటికీ దౌర్జన్యం, అణచివేతలతో సాధించే ఈ సమానత్వం సామాజిక న్యాయం అనిపించుకోదు. ఇది వాస్తవానికి, ఇంతకు ముందు చెప్పినట్లు సామూహిక దౌర్జన్యానికి పరాకాష్ఠ. మానవ చరిత్రలో ఇంతకుమునుపు ఎన్నడూ ఇలాంటి ఉదాహరణ కనబడదు.

## ఇస్లామీయ న్యాయం

ఇక ఇప్పుడు ఇస్లాంలో న్యాయం అంటే ఏమిటో తెలుసుకుందాం. ఎవరో ఒక వ్యక్తి లేదా ఒక గ్రూపు సొంతంగా తన బుద్ధికి తోచిన విధంగా మానవ జీవితాలలో న్యాయానికి సంబంధించిన విధానాలను, వాటిని అమలు పరిచే పద్ధతులను తయారుచేయడం, బలవంతాన వాటిని ప్రజలపై రుద్దడం, విమర్శించే వారి నోళ్ళు మూయించడం లాంటి రుగ్మతలకు ఇస్లామ్‌లో చోటులేదు. ఇలాంటి అధికారాలు అబూ బకర్ సిద్దీక్ రజి అల్లాహుఅన్హు, ఉమర్ ఫారూక్ రజి అల్లాహుఅన్హు లాంటి ఖలీఫాలకే కాదు స్వయంగా ప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు కూడా లభించలేదు. ఇస్లామ్‌లో ఎలాంటి నియంతకూ స్థానం లేదు. కేవలం అల్లాహ్‌కు మాత్రమే ఈ హోదా ఉంది.

మనుషులు ఆయన ఆదేశాలను కిమ్మనక తలదాల్చవలసి ఉంది. స్వయాన ప్రవక్త ముహమ్మద్ (సఅసం) కూడా దేవుని ఈ అత్యున్నత అధికారాలకు లోబడినవారే. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇచ్చే ఆదేశాలు దేవుని తరఫు నుంచి వచ్చిన ఆదేశాలు అయినందువల్ల వాటిని పాటించడం తప్పనిసరి విధి అయ్యింది. అంతేతప్ప (మాజ్ అల్లాహ్) ఆయన స్వయంగా తయారు చేసిన విధానాలు, ఆదేశాలు చెప్పలేదు. ప్రవక్త ముహమ్మద్ (సఅసం), ఆ పిదప ప్రముఖ ఖలీఫాల పాలనా కాలంలో కేవలం ఇస్లామీయ ధర్మశాస్త్రం (షరీఅత్) మాత్రమే విమర్శలకు అతీతంగా ఉండేది. షరీఅత్ మినహా మిగిలిన సమస్త విషయాలకు సంబంధించి విమర్శించే హక్కు ప్రతి ఒక్కరికి ఉండేది.

## వ్యక్తి స్వేచ్ఛకు హద్దులు

ఇస్లామ్‌లో అల్లాహ్ వ్యక్తి స్వేచ్ఛకు అవసరమైన హద్దులు నిర్ణయించాడు. ఈ హద్దుల పరిధిలోనే వ్యక్తిగత స్వేచ్ఛ పరిమితం. ఒక ముస్లింకు యేయే పనులు నిషిద్ధమో, ఏ పనులకు దూరంగా ఉండాలో, యే యే పనులు తప్పనిసరి విధులో, వేటిని ఖచ్చితంగా పాటించాలో, మనిషికి ఇతరులపై ఉన్న హక్కులు, అతనిపై ఇతరులకు ఉన్న హక్కులు తదితర విషయాలన్నీ స్వయంగా అల్లాహ్ నిర్ధారించాడు. ఆస్తి యాజమాన్యం ఎలాంటి పద్ధతిలో పొందడం ధర్మసమ్మతమో, అలాగే ఎలాంటి పద్ధతులు, మార్గాల ద్వారా ఆస్తి యాజమాన్యం పొందడం ధర్మసమ్మతంకాదో, వ్యక్తుల శ్రేయోక్షేమాల దృష్ట్యా సమాజంపై మనిషికి ఉండే హక్కులు ఏవో, సమాజ సంక్షేమం దృష్ట్యా వ్యక్తులపై, వంశాలపై, తెగలపై, పూర్తి జాతిపై ఎలాంటి నిబంధనలు విధించవచ్చునో, ఎలాంటి సేవలను తప్పనిసరి చేయవచ్చునో అల్లాహ్ స్పష్టం చేశాడు.

ఈ అంశాలన్నీ దివ్యఖుర్ఆన్, ప్రవక్త ప్రవచనాలతో రూపొందిన, ఎవ్వరూ తిరగరాయశక్యంకాని దైవికమైన, శాశ్వతమైన సంవిధానంలో పొందుపరచబడి ఉన్నాయి. ఇందులో మార్పులు చేర్పులు చేసే హక్కు ఎవ్వరికీ లేదు. ఈ సంవిధానం ఆధారంగా ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత స్వేచ్ఛపై విధించబడిన పరిమితులను అతిక్రమించడానికి వీలులేదు. అయితే ఈ పరిమితుల లోపల వ్యక్తికి ఉన్న వ్యక్తిగత స్వేచ్ఛను హరించే హక్కు కూడా



ఎవ్వరికీ లేదు. సంపాదన ఉపాధులకు సంబంధించి నిషేధించబడిన పద్ధతులు, సంపద ఖర్చు పెట్టడానికి సంబంధించి నిషేధించిన మార్గాలను ఏ వ్యక్తీ పాటించలేదు. అలాంటి పద్ధతులు, మార్గాలు అవలంబించిన వాళ్ళు ఇస్లామీయ చట్టం దృష్టిలో శిక్షార్హులు అవుతారు. అయితే ధర్మసమ్మతమైన మార్గాలు పద్ధతుల ద్వారా సంపాదించిన ఆస్తిపై సంపదపై అతడి హక్కులు సురక్షితంగా ఉంటాయి. ఆ సంపదను ఖర్చుపెట్టే విషయంలో ధర్మసమ్మతమైన మార్గాలలో అతడు ఖర్చుపెట్టడాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరు. ఇదే విధంగా సమాజ సంక్షేమానికిగాను యే యే బాధ్యతలు వ్యక్తులపై విధించబడ్డాయో ఆయా బాధ్యతలను నిర్వర్తించడం అతడికి తప్పనిసరి. ఆ బాధ్యతలకు మించి మరెలాంటి భారాన్ని అతడిపై బలవంతాన వేయడం కుదరదు. అయితే అతడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అదనపు బాధ్యతలు స్వీకరిస్తే అది వేరే విషయం. సమాజానికి, రాజ్యానికి కూడా ఇవే సూత్రాలు వర్తిస్తాయి. రాజ్యానికి, సమాజానికి వ్యక్తులపై అధికారం చలాయించే హక్కు ఎంత ఉందో అదే విధంగా వ్యక్తులకు ఈయబడిన హక్కులను రాజ్యం లేదా సమాజం వారికి ఇవ్వడమూ తప్పనిసరి అవుతుంది. ఈ శాశ్వత స్థాయిగల సంవిధానాన్ని ఆచరణలో పెడితే ఆదర్శవంతమైన సామాజిక న్యాయం ఆచరణలో కనబడుతుంది. ఈ సంవిధానం ఉన్నంతకాలం ఎవరు ఎన్ని విధాల ప్రయత్నించినా ముస్లిములను మోసపుచ్చలేరు. ఎక్కడి నుంచో అరువు తెచ్చుకొని సామ్యవాదమే ఇస్లాం అని లేదా ఇస్లామీయ సోషలిజం అని మభ్యపెట్టలేరు.

ఈ ఇస్లామీయ వ్యవస్థలో వ్యక్తికి, సమాజానికి మధ్య ఉన్న సాటిలేని సమతుల్యం వల్ల సమాజ ప్రయోజనాలను దెబ్బతీసే స్వేచ్ఛ వ్యక్తులకు లేదు. అలాగే మనిషి వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన స్వేచ్ఛను కబళించే అధికారం సమాజానికీ లేదు.

## ఆస్తి యాజమాన్యం మార్పిడి

ఇస్లాంలో వ్యక్తుల ఆస్తి యాజమాన్యం ఒకరి నుంచి మరొకరికి మారే పరిస్థితులు కేవలం మూడు నిర్ణయమై ఉన్నాయి. అవి వారసత్వం, హిబా (ధారాదత్తం చేయడం), ఆర్జన. ఏదైనా ఆస్తి ధర్మసమ్మతమైన యాజమాన్య

హక్కులు ఉన్న వ్యక్తి నుంచి అతని వారసులకు ఇస్లామీయ చట్టాలకు అనుగుణంగా మాత్రమే లభిస్తుంది. ఇది వారసత్వంగా జరిగి ఆస్తి చేతులు మారడం. ఇక 'హిబా' విషయానికి వస్తే ధర్మసమ్మతంగా ఏదైనా సంపద కలిగి ఉన్న వ్యక్తి ఇస్లామీయ షరీఅత్‌కు అనుగుణంగా ఆ సంపదను ఇతరులకు ధారాదత్తం చేయడం హిబా అవుతుంది. ఒకవేళ ప్రభుత్వం స్వయంగా ఇలా ధారాదత్తం చేస్తున్నట్లయితే అలా చేయడమన్నది ఏదైనా ప్రత్యేక సేవకు ప్రతిఫలంగా లేదా సమాజ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఆస్తుల నుంచి ధర్మసమ్మతమైన పద్ధతిలో ఇచ్చినప్పుడే చెల్లుతుంది.

ప్రభుత్వాన్ని నిలదీసి అడిగే హక్కు ప్రజలకు ఉన్నటువంటి ఇస్లామీయ షరీఅత్ ప్రకారం 'షూరా' (సలహామండలి) పద్ధతిలో నడిచే ప్రభుత్వానికి మాత్రమే ఇలా ఇచ్చే హక్కు ఉంటుంది. ఇక సంపాదన, ఆర్జనల విషయానికి వస్తే ఇస్లామ్‌లో సంపాదన వ్యయం పూర్తిగా ధర్మసమ్మతమే. అయితే సంపాదన వ్యయాలు నిషిద్ధ పద్ధతులలో ఉండరాదు. దొంగతనం, అక్రమ సంపాదన, తూనికలు కొలతల్లో మోసం, అన్యాయంగా కబళించడం, లంచం, అక్రమంగా దోచుకోవడం, వ్యభిచారం, బ్లాక్ మార్కెటింగ్, వడ్డీ, జూదం, వ్యాపారంలో ద్రోహం, మత్తు పదార్థాలు తయారుచేయడం, మాదక ద్రవ్యాల వ్యాపారం, అశ్లీల ప్రచురణల వ్యాపారం వంటి మార్గాల ద్వారా సంపాదన ఇస్లామ్‌లో నిషిద్ధం. ఈ పరిమితులను, హద్దులను పాటిస్తూ ఎవరు ఎంత సంపాదించినా అది అతనికి ధర్మసమ్మతమైన సంపద అవుతుంది. అలా సంపాదించినది తక్కువ ఉన్నా, ఎక్కువ ఉన్నా అతడి ధర్మబద్ధమైన ఆస్తియే అవుతుంది. ఇలాంటి ఆస్తికి కనిష్ట గరిష్ట పరిమితులు విధించడానికి వీలులేదు. వ్యక్తిగత సంపద తక్కువ ఉండడం వల్ల ఇతరుల ఆస్తులను కబళించే అవకాశం లేదు. అలాగే వ్యక్తిగత ఆస్తి ఎక్కువ ఉందని అతడి నుంచి కొంత లాక్కుని తగ్గించడమూ కుదరదు. అయితే ఈ ధర్మబద్ధమైన మార్గాలను అతిక్రమించి సంపాదించిన ఆస్తి గురించి "ఇదంతా ఎలా వచ్చింది?" అని ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంది. ఆ ఆస్తికి సంబంధించి చట్టపరమైన విచారణ ముందు జరగాలి. విచారణలో ఆ ఆస్తి ధర్మబద్ధమైన మార్గాల ద్వారా సంపాదించినది కాదని తేలితే ఆ ఆస్తిని స్వాధీనపరచుకొనే హక్కు ఇస్లామీయ ప్రభుత్వానికి ఉంది.



## వ్యయంపై ఆంక్షలు

ధర్మబద్ధమైన మార్గాల ద్వారా సంపాదించిన ఆస్తి అయినా సరే యే వ్యక్తికీ ఖర్చుపెట్టే విషయంలో విశృంఖల స్వేచ్ఛ లేదు. ఖర్చు విషయంలో చట్టపరమైన పరిమితులు ఉన్నాయి. ఏ వ్యక్తి కూడా తన ఆస్తి నుంచి సమాజానికి నష్టం కలిగించే విధంగా ఖర్చుచేసే వీలు లేకుండా చేసింది ఇస్లామ్. ఇస్లాంలో యే వ్యక్తి తన సంపదను వ్యర్థంగా, లేదా పాపకార్యాల్లో ఖర్చుపెట్టలేడు. మద్యపానం, జూదం పూర్తిగా నిషిద్ధం. వ్యభిచారానికి అవకాశం లేదు. స్వతంత్రులయిన ప్రజలను బలవంతాన నిర్బంధించి బానిసలుగా చేసుకొని వారి క్రయవిక్రయాలు నడిపే అవకాశమూ లేదు. సంపన్నులు తమ ఇళ్ళను బానిస స్త్రీల కారాగారాలుగా మార్చే వీలులేదు. వృధా ఖర్చులు, హద్దుల్లేని సుఖభోగాలపై కూడా ఇస్లాం ఆంక్షలు విధించింది. పొరుగువాడు ఆకలితో అలమటిస్తూ ఉంటే తాను సుఖభోగాలతో గడిపే అనుమతి ఎవరికీ లేదు. మనిషి కేవలం ధర్మబద్ధమైన, మంచి పద్ధతుల ద్వారా మాత్రమే సంపదను ఖర్చు చేయాలని నిర్దేశిస్తుంది ఇస్లాం. ఎవరైనా తన వద్ద ఉన్న అదనపు సంపదను ఉపయోగించి మరింత సంపాదించి లాభాలు గడించాలనుకొంటే అతడు ధర్మబద్ధమైన పద్ధతులు, మార్గాల ద్వారా మాత్రమే అలా చేయగలడు. ఇస్లామీయ ధర్మశాస్త్రం సంపాదనా పద్ధతుల విషయమై విధించిన హద్దులను అతిక్రమించే అవకాశం ఎవరికీ లేదు.

## సమాజ సేవ

సమాజ సేవాదృక్పథంతో ఇస్లాం సంపన్నులపై, అంటే నిర్ధారిత ప్రమాణాలకన్నా ఎక్కువ సంపద కలవారిపై 'జకాత్' విధించింది. వ్యాపార వస్తువులపై, వ్యవసాయ ఉత్పత్తులపై, పశుసంపదపై, ఇంకా మరికొన్ని ఆస్తులపై నిర్ణీత శాతం జకాత్‌గా నిర్ణయించింది. ప్రపంచంలోని యే దేశంలో అయినా సరే, షరీఅత్ నిర్దేశాల ప్రకారం జకాత్ వసూలు చేస్తే, దివ్యఖుర్ఆన్ నిర్దేశించిన పద్ధతుల ప్రకారం ఆ జకాత్‌ను ఖర్చుచేస్తే, కొన్నేళ్ళలోనే ఆ దేశంలో బీదలు నిరుపేదలుగా ఎప్పుడు ఉండరని ఖచ్చితంగా చెప్పవచ్చు.

అలాగే ఒక వ్యక్తి వద్ద ప్రోగుపడిన సంపదను, అతడు మరణించిన వెంటనే వారసులకు పంపిణీ అయ్యేలా చేస్తుంది ఇస్లాం. ఆ విధంగా ప్రోగుబడిన సంపద శాశ్వతంగా ఒకే చోట ఉండకుండా ఏర్పాట్లు చేసింది ఇస్లాం.

## దౌర్జన్యాలకు కళ్ళెం

భూ యజమాని, రైతు, కార్ఖానా యజమాని, కార్మికుల మధ్య వ్యవహారాలు పరస్పర సమ్మతితో మంచి పద్ధతిలో జరుగాలని ఇస్లాం అభిలషిస్తుంది. ఈ సందర్భంగా చట్టం జోక్యం చేసుకొనే పరిస్థితి రాకుండా ఉండాలని ఆకాంక్షిస్తుంది. కాని, ఈ వ్యవహారాలలో ఎక్కడయినా దౌర్జన్యం జరుగుతున్నట్లయితే అక్కడ జోక్యం చేసుకొనే హక్కు ఇస్లామీయ ప్రభుత్వానికి ఉంది. చట్టపరంగా న్యాయం జరిగేలా చూస్తుంది.

## ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వ ఆస్తులు

ప్రభుత్వం స్వయంగా ఏదైనా పరిశ్రమను నడుపడం లేదా ఏదైనా వ్యాపారం నిర్వహించడం ఇస్లాంలో నిషిద్ధం కాదు. ఏదైనా పరిశ్రమ లేదా వ్యాపారం సమాజ సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం స్వయంగా నడుపడం అవసరమయితే, లేదా ప్రయివేటు వ్యక్తులు అలాంటి పరిశ్రమ లేదా వ్యాపారాన్ని చేపట్టడానికి సిద్ధంగా లేనట్లయితే లేదా ఏదైనా పరిశ్రమ వ్యాపారం ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉండడం సామూహిక ప్రయోజనాల రీత్యా మంచిది కానట్లయితే అలాంటి పరిస్థితిలో ఆ పరిశ్రమ లేదా వ్యాపారాన్ని ప్రభుత్వ నిర్వహణలో నడుపవచ్చు. అదే విధంగా ఏదైనా పరిశ్రమ లేదా వ్యాపారం ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నప్పటికీ, ఆ పరిశ్రమ లేదా వ్యాపారం ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉండడం సామూహిక ప్రయోజనాలకు నష్టం కలిగించే పరిస్థితి ఉంటే ప్రభుత్వం వారికి నష్టపరిహారం చెల్లించి ఆ వ్యాపారాన్ని లేదా పరిశ్రమను తన యాజమాన్యంలోకి తీసుకోవచ్చు. తన సొంత నిర్వహణలో నడుపుకోవచ్చు. ఈ చర్యలు తీసుకోవడంలో లేదా ఈ పద్ధతులు పాటించడంలో ఎలాంటి అభ్యంతరమూ షరీఅత్ పరంగా లేదు. అంతే తప్ప సంపదగాని, సంపాదన, ఉత్పాదనా వనరులుగాని అన్నీ ప్రభుత్వ అధీనంలో ఉండాలనడం ప్రభుత్వమే



దేశంలో ఏకైక పారిశ్రామిక వేత్త, ఏకైక వ్యాపారవేత్త, ఏకైక భూస్వామిగా ఉండాలనడం సూత్రప్రాయంగా ఇస్లాంలో ఆమోదయోగ్యం కాదు.

## ప్రజాధనం ఖర్చుపెట్టే పద్ధతి

ప్రజాధనం అల్లాహ్‌కు, ప్రజలకు చెందినదని ఇస్లామ్ స్పష్టంగా ప్రకటిస్తుంది. దీనిని ఎవ్వరూ తన సొంత సొమ్ముగా ఖర్చుపెట్టడం కుదరదు. ముస్లిముల సమస్త వ్యవహారాల మాదిరిగానే ప్రజాధనం నిర్వహణ కూడా జాతి ప్రజల లేదా వారి స్వతంత్ర ప్రతినిధుల సలహా సంప్రదింపులతో జరగాలి. ఎవరి వద్ద నుంచి ఎంత తీసుకున్నా, యే పద్దు క్రింద ఎంత ఖర్చుపెట్టినా అదంతా ధర్మబద్ధంగా, షరీఅత్ పద్ధతుల ప్రకారం జరగాలి. సాధారణ ప్రజలకు ఈ విషయమై లెక్క అడిగే పూర్తి హక్కు ఉంటుంది.

## ఒక ప్రశ్న

ఈ వ్యాసాన్ని ముగించేముందు, ఆలోచించే వారిని నేను అడిగే ప్రశ్న ఒక్కటే – సామాజిక న్యాయం అంటే కేవలం ఆర్థిక సమానత్వమే అయినట్లయితే, ఇస్లాంలో లభించే ఆర్థిక న్యాయం చాలదా? ప్రజలందరి వ్యక్తిగత స్వేచ్ఛలను హరించడం, ప్రజల ఆస్తులు జప్తు చేయడం పూర్తి జాతి ప్రజలను గుప్పెడు మంది నేతలకు బానిసలు చేయడం ద్వారా పొందే ఆర్థిక సమానత్వం అవసరమా? ముస్లిములు తమ తమ దేశాల్లో ఇస్లామీయ సంవిధానం ప్రకారం షరీఅత్ ప్రకారం నడిచే ప్రభుత్వాలను స్థాపించి, దైవం పంపిన ధర్మశాస్త్రాన్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా అమలు చేయడంలో ఆటంకం ఏమిటి? ఇలా మనం చేసిన రోజున, సామ్యవాదం ద్వారా ప్రయోజనం పొందవలసిన అవసరం ఎంత మాత్రమూ ఉండదు. పైగా సామ్యవాద వ్యవస్థలలో ఉన్న ప్రజలు స్వయంగా మన జీవన వ్యవస్థను చూసి యే వెలుగు కోసం వాళ్ళు చీకట్లలో తచ్చాడుతున్నారో ఆ వెలుగు తమ ముందే ఉందని గుర్తిస్తారు.

- : సమాప్తం : -